'గడప గడప'లో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: 'గడప గడప'తో స్థానిక సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మద్దూరులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి పథకాల బుక్‌లెట్లు పంపిణీ చేసి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు సంతోషంగా గడుపుతున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరువ చేస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు.

ప్రతిపక్షాల కళ్లు మూసుకుపోయాయి

దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తుంటే ప్రతిపక్షాలు కళ్లు మూసుకుపోయి అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. దేశం గర్వించే స్థితిలో సంక్షేమ పథకాలను జగనన్న అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచి చిప్పల రామదాసు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీబాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఎంపీటీసీ ఒడుగు శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ మోర్ల రామచంద్రరావు, నెరుసు సతీష్, నాయకులు ఒడుగు ఆంజనేయులు, నాగార్జున, రవి పాల్గొన్నారు.



మద్దూరులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

క్లుప్తంగా

'వాసవి' ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



పెనమలూరు: పోరంకిలో వాసవి క్లబ్ నవ నిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యాన శనివారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా 50 రోజులుగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశామన్నారు. పుచ్చకాయ ముక్కలు కూడా అందిస్తున్నామని తెలిపారు. 50వ రోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేబినెట్ ట్రెజరర్ డీవీఏకే సత్యనారాయణ పాల్గొన్నారన్నారు. క్లబ్ కార్యదర్శి హారిక, జయశ్రీ, సభ్యులు కోటేశ్వరరావు, సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో నీటి సమస్య పరిష్కారం

పెనమలూరు: సనత్‌నగర్‌లో మంచినీటి సమస్య శనివారం పరిష్కారమైంది. మసీదు వద్ద మంచినీటి పైప్‌లైన్ పూర్తిగా ధ్వంసమై నీటి సమస్య ఎదురైంది. ఈ సమస్యను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి వైఎస్సార్ సీపీ స్థానిక నేతలు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన నూతన పైప్‌లైన్ వేసి వెంటనే నీరు సరఫరా చేశారు. తమ సమస్య వెంటనే పరిష్కారం చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు చాన్‌బాషా, ఖాదర్, రెహమాన్, సిద్ధిక్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

110 మందికి కంటి పరీక్షలు

కంకిపాడు: నెప్పల్లిలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉప్పులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆప్తాలమిక్ అధికారి రాజేష్‌కుమార్ 110 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేశారు. కళ్లు ఎర్రబడి, నీరు కారడం, కంటి దురదలు, తలనొప్పిగా ఉన్నా వెంటనే కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ఎస్.బిందుమాధవి, జి.విక్టోరియా, సీహెచ్ జ్యోతి, జి.ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురులో శనివారం 120 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలో శ్రీసత్యసాయి హైస్కూల్ ప్రాంగణంలో గోదావరి-కృష్ణా కో ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ పవన్‌కుమార్, స్కూల్ డైరెక్టర్ కోటంరాజు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు బ్రాంచి మేనేజర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, లబ్బీపేట బ్రాంచి, ఎమ్.జి.రోడ్, విజయవాడ గారి సంజాయిషీ ఏమనగా

తుమ్మల హస్వంత్ మరియు వీరి తండ్రి గారైన తుమ్మల కోటేశ్వరరావు గారు ఎడ్యుకేషన్ లోను నిమిత్తమై నా క్లయింటు బ్యాంకు నందు దరఖాస్తు చేసికొనియున్నారు. అందునిమిత్తమై సెక్యూరిటీగా వార్కి గల ఆస్తి ఒరిజినల్ దస్తావేజులు డిపాజిట్ చేసియున్నారు. అట్టి దస్తావేజులలో ది. 04-03-1991న ద.నెం. 26/బి.3.3/1991 రుగా శ్రీమతి పాలడుగు కామేశ్వరమ్మ గారు తన మనుమరాలైన గుమ్మడి వాణి గార్కి వ్రాసిన ఒరిజినల్ వీలునామా పోయినందున తగు చర్యలు తీసికొన్ననూ దొరికియుండనందున నా క్లయింటు బ్యాంకు నందు సర్టిఫైడు కాపీ యిచ్చియున్నారు. కావున అట్టి ఒరిజినల్ వీలునామాపై ఎవరికైనా ఎటువంటి లావాదేవీలు గానీ, అభ్యంతరాలు గానీ వున్నయెడల 7 రోజులలోపు వ్రాతపూర్వకముగా తెలుపగలరు.

గొడుగుపేట, మచిలీపట్నం
ది. 13-5-23

పసుమర్తి సూర్యప్రకాష్, న్యాయవాది
ఫోన్ : 98661 27503

నీతి కథలు.. విద్యార్థుల ఉన్నతికి బాటలు

గన్నవరం రూరల్: విద్యార్థులు నీతి కథలను వింటూ, చదువుకుంటూ నిజాయతీగా ఎదగాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా శనివారం స్థానిక లైబ్రరీలో నీతి కథలు, కవితలు, పద్యాలు విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ నిజాయతీగా ఎదిగిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. భవిష్యత్‌కు బాటలు వేసే పద్యాలు తెలుగులో ఉన్నాయని, మాతృభాష గొప్పదనాన్ని వివరించారు. విద్యార్థులు తమకు తెలిసిన కథల్లో నీతిని వివరించారు. విజేతలను అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యాన విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు శేషగిరిరావు ఆధ్వర్యాన పంచతంత్ర కథలు వినిపించారు. గ్రంథాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠకులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న లైబ్రేరియన్ కృపానందం

ఉంగుటూరు: మండలంలో పలు శాఖా గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో శనివారం విద్యార్థులకు ఆటలు, నీతి కథలు రాయడం నేర్పించారు. ఉంగుటూరులో జరిగిన తాడు లాగుడు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని విద్యార్థులు ప్రతిభ చాటారు. మానికొండ, ఆత్కూరు, తేలప్రోలు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి.



ఉయ్యూరు గ్రంథాలయంలో..

ఉయ్యూరు: గ్రంథాలయాలు విజ్ఞానం పెంపునకు దోహదపడతాయని చెస్ మాస్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో కథలు చదివించారు. అనంతరం చెస్, క్యారమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమజ్జయంతి పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు చేయనున్నారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచే ఆలయంలో అంజనీపుత్రునికి సుప్రభాత సేవ, అర్చన, పంచామృతాలతో అభిషేకం నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ పాలకమండలి, దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లో నిల్చునే భక్తులకు తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు ప్రధాన రోడ్ల వెంట తాగునీరు, మజ్జిగ పంపిణీ శిబిరాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించనున్నారు. రాత్రికి భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు.

భారీ అన్నసమారాధన

హనుమాన్‌జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 40 ఏళ్లుగా హనుమజ్జయంతికి భారీ అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ రోడ్డులోని విఘ్నేశ్వర పంచముఖ ఆంజనేయ సహిత సీతారామ దేవస్థానం వద్ద దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేశారు. దాదాపు 25 వేల మందికి అన్నదానం చేయడానికే సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు కనుమూరి భాస్కరరాజు తెలిపారు. బైపాస్ రోడ్డు వద్ద ఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయతలపెట్టిన 36 అడుగుల అభయాంజయ స్వామి విగ్రహం నమునాను అన్నదానం ప్రాంగణంలో భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేయనున్నారు.

భజే రుద్రరూపం

దావాజిగూడెం(గన్నవరం): దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉపాలయంలోని శ్రీఅభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో స్వామివారికి పంచామృతాలు, 41 కేజీల చందనం, వివిధ రకాల పండ్ల రసాలతో భక్తులు అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.



చిక్కవరంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన హనుమంతుడు

గన్నవరం రూరల్: చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో హనుమత్ జయంతి సందర్భంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం మంగళ వాయిద్యాలు, వేద పారాయణంతో కార్యక్రమం ప్రారంభమైంది. సాయంత్రం మూల మంత్ర సహిత ఉపనిషత్ హోమాలు చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యం

కంకిపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు 'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన సేవలు అందిస్తామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయ్ అన్నారు. కందలంపాడులో ఆమె శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు పరిశీలించి, రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు గ్రామ స్థాయిలోనే ఉత్తమ ప్రమాణాలతో వైద్యం అందుతుందన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. వైద్య సేవలు అందిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ భాగ్యశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, రాచమల్ల శ్యామ్ ప్రసాద్, సీహెచ్‌ఓ మోహనరూప, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కందలంపాడులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

తాడిగడప మునిసిపాలిటీలో సిబ్బంది చేతివాటం

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీలో ఇంటి పన్నులు వేసే విషయంలో సిబ్బంది చేతివాటం ఎక్కువైంది. భవన యజమానుల అవసరాలు ఆసరాగా తీసుకుని కొందరు మునిసిపాలిటీ సిబ్బంది పన్ను వేయాలన్నా, పన్ను తగ్గించాలన్నా చేతివాటం చూపుతున్నారు. మునిసిపాలిటీలో ఎటువంటి తనిఖీలు లేకపోవటంతో కొందరు ఉద్యోగులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికీ ఇంకా మునిసిపాలిటీ పరిధిలో చాలా వరకు ఇంటి పన్నులు వేయాల్సి ఉంది. కానూరులో ఇంటి పన్ను విషయంలో సొమ్ము డిమాండ్ చేయటంతో ఏసీబీ అధికారులు ఆర్ఐ సుబ్బరాజు, ఉద్యోగి నాగబాబును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కటకటాలకు పంపారు.

మునిసిపాలిటీగా ఆవిర్భవించాక...

తాడిగడప మునిసిపాలిటీ ఆవిర్భవించి దాదాపు రెండు సంవత్సరాలు దాటింది. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న కాలంలో రెంటల్ వాల్యూపై ఇంటి పన్నులు వేసేవారు. అప్పట్లో ఇంటి పన్నులు వేసే సమయంలో చూసీచూడనట్లుగా వ్యవహరించేవారు. అయితే తాడిగడప మునిసిపాలిటీగా ఏర్పడిన తరువాత రెంటల్ వాల్యూకు బదులుగా ఆస్తి ఆధారిత విలువగా (ప్రాపర్టీ వాల్యూ)గా పన్నులు వేస్తున్నారు. అలాగే కొత్తగా భవనాలు నిర్మాణం చేసుకునే వారు కూడా ఇంటి పన్నులు వేయాలని మునిసిపాలిటీ చుట్టూ తిరుగుతున్నారు. మునిసిపాలిటీ పరిధిలో 46 వేల ఇళ్లు ఉండటం, చాలినంత సిబ్బంది లేకపోవటంతో పన్నులు పూర్తి స్థాయిలో వేయలేదు. యనమలకుదురు, కానూరు ప్రాంతాల్లో ఇంకా ఇంటి పన్నులు లేని వారు చాలా మంది ఉన్నారు. అధికారులు ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలకు పన్నులు వేసే విషయమై న్యాయం చేయాల్సి ఉంది.



తాడిగడప మునిసిపల్ కార్యాలయం

అందుబాటులో ప్రభుత్వ కాల్ సెంటర్లు...

అవినీతి ఉద్యోగుల ఆట కట్టించటానికి ప్రభుత్వం కాల్ సెంటర్లు అందుబాటులో ఉంచింది. జగనన్నకు చెబుదాం 1902 టోల్ ఫ్రీ నంబర్, ఏసీబీ కాల్ సెంటర్ 14400 ప్రజలకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇంటి పన్నుల విషయంలో సొమ్ము డిమాండ్ చేస్తే వెంటనే బాధితులు కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే న్యాయం జరుగుతుంది.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



హనుమాన్‌జంక్షన్ రూరల్: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన రేమల్లే జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దాతలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. బాపులపాడు మండలం రేమల్లే జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కాగిత మణి కిరణ్ 549 మార్కులతో పాఠశాల ప్రథమస్థానం, గండి చరణ్ కుమార్ 543 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి గ్రామానికి చెందిన యనమదల భీమ శంకరరావు ఆయన తండ్రి బాబు వెంకయ్యారావు జ్ఞాపకార్థం రూ.25 వేలు నగదు ప్రోత్సాహకంగా శనివారం అందజేశారు. మణి కిరణ్‌కు రూ. 14 వేలు, చరణ్‌కుమార్‌కు రూ.11 వేల నగదు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు కుమార స్వామి, పద్మాదేవి తదితరులు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల పరిశీలన

గన్నవరం: స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని శనివారం సమగ్రశిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి శేఖర్‌బాబు సందర్శించారు. విద్యార్థులకు పంపిణీ చేయడానికి కార్యాలయంలో సిద్ధం చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను ఆయన పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి జగనన్న విద్యా కానుక కిట్లను పూర్తిస్థాయిలో పాఠశాలలకు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం దావాజీగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లమెంటరీ విద్యార్థుల ప్రత్యేక తరగతులను పర్యవేక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎంఈఓ బి.శ్రీనివాస్, నాడు-నేడు మానటరింగ్ అధికారి రాంబాబు, హెచ్ఎం విజయరామారావు, పలువురు సీఆర్పీలు పాల్గొన్నారు.



జేవీకే కిట్లు పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

సత్తా చాటిన ఆంధ్ర విద్యార్థి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో తాడిగడప నివాసి డాక్టర్ మంచిరాజు సీతారామచంద్రశేఖర్ అమెరికాలో సత్తా చాటాడు. అతని ప్రతిభకు పీహెచ్‌డీ రావటమే కాకుండా మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీలో ఎటిబ్రాడ్ కాలేజీ ఆఫ్ బిజినెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించాడు. సీతారామచంద్రశేఖర్ ఐఐటీ మద్రాస్‌లో మాస్టర్స్ టెక్నాలజీ పూర్తి చేశారు. డల్లాస్‌లో టెక్సాస్ విశ్వ విద్యాలయంలో మేనేజిమెంట్ సైన్స్‌లో పీహెచ్‌డీ సాధించారు. ఏ ప్రాంతంలో ఏ వస్తువుకు ఎంత ధర నిర్ణయించడం, వాటి నుంచి రాబడి, అభివృద్ధి చేయడం అంశంపై పరిశోధన చేశారు. సీతారామచంద్రశేఖర్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



డాక్టర్ సీతారామచంద్రశేఖర్

ప్రతిభ చూపిన షూటర్లకు అభినందన



పెనమలూరు: ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ ఆధ్వర్యాన తాడిగడపలో జరిగిన అంతర్ జిల్లాల షూటింగ్ పోటీల్లో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర గార్డెన్స్ షూటర్స్ సత్తా చాటారు. భార్గవ్‌రామ్, అక్షమ దాయంకు బంగారు పతకాలు, కర్రి నాగభువకు రెండు బంగారు పతకాలు, షణ్ముఖ్‌కు బంగారు పతకం, అక్బర్‌పాషా, రజిత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మహేశ్వరరావు, కటికల క్రిస్టోఫర్, గోపీనాథ్, సోల్‌మాన్, పి.శ్రీనివాసరావు, సీతారాణి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పెనమలూరు: పర్యావరణాన్ని కాపాడుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ టి.రమానాగమణి అన్నారు. గోసాల సెక్టార్‌లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యాన మిషన్ లైఫ్ ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ టి.రమానాగమణి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడొద్దని, మొక్కలు పెంచాలని, సేంద్రియ ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యూరు: జిల్లాలోని ఏపీ గిరిజన రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చేరదలచిన గిరిజన బాలురు దరఖాస్తు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.ఫణిధూర్జటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన శనివారం తరగతుల వారీగా వివరాలు తెలుపుతూ 3వ తరగతిలో 40 సీట్లు, 4వ తరగతిలో 37, 5వ తరగతిలో 36, 6వ తరగతిలో 26 , 7వ తరగతిలో 18, 8వ తరగతిలో 17 ,9వ తరగతిలో 25 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయని, దరఖాస్తు చేయడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని వివరించారు. జూన్ 11వ తేదీన జాబితా ప్రకటిస్తామని, జూన్ 12 తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

మొక్కల పెంపకంతో మానవ మనుగడ

గన్నవరంరూరల్: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ముడిపడి ఉందంటూ ముస్తాబాదలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన శనివారం ర్యాలీ నిర్వహించారు. ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పర్యవేక్షణలో జరిగిన ర్యాలీలో పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని నినాదాలు చేశారు. మిషన్ లైఫ్ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలని, సామాజిక స్థలాల్లో, రోడ్ల వెంట, చెరువు గట్ల వెంట మొక్కలు నాటుదామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మొక్కల పెంపకంతో వాతావరణ సమతౌల్యం ఏర్పడి చల్లని వాతావరణం, సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. దీంతో ఆక్సిజన్ పెరిగి ఆరోగ్య సమాజం నిర్మాణమవుతుందన్నారు. భూమి ఉపరితల వాతావరణాన్ని కాపాడుకునేందుకు కృషి చేద్దామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కల పెంపకంతో పాటు ఆకుకూరలు, కూరగాయలు పండించాలని ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్టు సీడీపీవో డి.వెంకటలక్ష్మి సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు అనిత, వనజ, నాగలక్ష్మి, వలంటీర్ ఇందిరా ప్రియదర్శిని, కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాతలకు సత్కారం

రామవరప్పాడు: సామాజిక సేవలందిస్తూ, స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచిన మహిళలను అను మై బేబీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మాతృ దినోత్సవ నేపథ్యంలో ఎనికేపాడులోని అను మై బేబీ హాస్పిటల్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ సేవా సంస్థలకు సారథ్యం వహిస్తున్న మహిళలను ఈ సందర్భంగా సన్మానించారు. ఆర్థిక సమతా మండలి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జి. మారు, బీ బెస్ట్ ఎడ్యుకేషన్ అండ్ ఇమిగ్రేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కరంబీర్ కౌర్, అమృత హస్తం ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ దారా కరుణశ్రీ ఇన్నర్ వీల్ దివాస్ ప్రెసిడెంట్ కొడాలి కవితలను సత్కరించారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి. రమేష్, హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ జి. శ్రీదేవి, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ బల్బుల వినియోగంతో విద్యుత్ ఆదా

పెనమలూరు: ఎల్ఈడీ బల్బుల వినియోగంతో విద్యుత్ ఆదా అవుతుందని సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు చెప్పారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు కానూరులో శనివారం ఎల్ఈడీ బల్బులపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఈడీ బల్బులు వాడకంతో విద్యుత్ వినియోగం తగ్గుతుందన్నారు. పర్యావరణానికి కూడా హాని కలగదని తెలిపారు. కరెంట్ బిల్లు తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.

అత్తింటివారిపై వేధింపుల కేసు

పెనమలూరు: అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసును పెనమలూరు పోలీసులు శనివారం నమోదు చేశారు. గంగూరు గ్రామానికి చెందిన షేక్ చాందిని 2007లో అక్బర్‌బేగ్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త హైదరాబాద్ వెళ్లి అక్కడ ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదని అదనపు కట్నం తీసుకురమ్మని భర్తతో పాటు అత్త జరీనా, మామ ముజఫర్‌బేగ్ వేధిస్తున్నారు. మామ.. చాందినితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.